క్లుప్తంగా

వైభవంగా బూరుగులమ్మ తీర్థం

అంబాజీపేట: పుల్లేటికుర్రులో వేంచేసిన గ్రామదేవత బూరుగులమ్మ తీర్థం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామ ఆడపడుచులు మొక్కులు, నైవేద్యాలు చెల్లించారు. అంతకుముందు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. గురువారం రాత్రి జరిగిన జాతరలో గరగ నృత్యాలు, కోయ డ్యాన్స్‌లు, తీన్‌మార్‌తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, మండల ఇంజినీరింగ్ జేఈ కె.మురళీకృష్ణ అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు ప్రజా సంక్షేమ పథకాలను అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్య రక్షణ కోసం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను అధిగమించాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు కె.సంజీవ్‌రెడ్డి, ఆర్‌వీవీ సత్యనారాయణ, శ్యామ్‌సుందర్, కె.మోక్షాంజలి, ఎస్.వీర్రాజు, యు.రేణుక, సుప్రియ, వెంకటరెడ్డి, అయ్యన్న, సీహెచ్ వీరమాత, వేణు, డి.సుబ్బారావు పాల్గొన్నారు.

మసీదు, షాదీఖానాల కమిటీ అధ్యక్షుడిగా ఖాజాబాబు



కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డి పాలెం జామియా మసీదు, షాదీఖానా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక మసీదులో అర్షద్ అలీఖాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల ముస్లిం నాయకుడు షేక్ గౌస్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ బడేమియా, ఎం.హరుణ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. గతంలో మసీదుకు, షాదీఖానాకు వేర్వేరు కమిటీలు ఉండగా ఈసారి రెండింటికీ ఒకే కమిటీగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ ఖాజాబాబు, ఉపాధ్యక్షుడిగా బిలాల్, ప్రధాన కార్యదర్శిగా ఫరీద్, సంయుక్త కార్యదర్శులుగా జిలాని, గౌస్ మొహిద్దీన్, కోశాధికారిగా మగ్బూల్, సంయుక్త కోశాధికారిగా మస్తాన్, సభ్యులుగా బాసు వానపల్లి, సందాని, గుడూర్ బాబు, షేక్ మీర్సా, మునీర్, సలహాదారులుగా షేక్ గౌస్ మొహిద్దీన్, బాబు, బడేమియా, అర్షద్ అలీఖాన్, డాక్టర్ హైదర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పీచు ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెంలో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానిక అడబాల మోహన్ రాంబాబుకు చెందిన పీచు ఫ్యాక్టరీలో మంటలు చెలరేగి పీచు బేళ్లు దగ్ధమయ్యాయి. రెండు మెషీన్లు కూడా దగ్ధమయ్యాయి. ముడి పీచు కూడా దగ్ధమైంది. ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల ఆస్తి నష్టం ఉంటుందని అంచనా. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. కాల్చిన చుట్ట, సిగరెట్ ముక్కలు వేయడం వల్ల మంటలు రేగినట్లు అనుమానిస్తున్నారు.

యువకుడిపై కిడ్నాప్ కేసు

అంబాజీపేట: ఓ మైనర్ బాలికను తన ఇంటి వద్ద నుంచి బలవంతంగా తీసుకుపోయాడని తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పుల్లేటికుర్రు శివారు చినలంకకు చెందిన గుమ్మడి ప్రసాద్ తన కుమార్తె ఈ నెల 6వ తేదీ నుంచి కనిపించడం లేదన్నారు. అదే చినలంకకు చెందిన చిల్లే రత్నంరాజు తన ఇంటికి వచ్చి అర్ధరాత్రి సమయంలో బలవంతంగా తీసుకుని వెళ్లిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నాడన్నారు. ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో కిడ్నాప్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపేట: మామిడిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ జారి పడి వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు స్థానిక ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఖండ్రిగ పంచాయతీ పులుసుగంటివారిపేటకి చెందిన పులుసుగంటి సత్యనారాయణ (50) గత నెల 20న తన ఇంటి సమీపాన ఉన్న మామిడిచెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు అతడిని రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో జాయిన్ చేశారు. అప్పటికే అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ప్రేమ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

మామిడికుదురు: ఎస్టీయూ 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మామిడికుదురు ఎమ్మార్సీ వద్ద ఎస్టీయూ పతాకాన్ని సంఘం అధ్యక్షుడు కేవీ రాఘవరావు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ ఎంతో కీలక పాత్ర వహించిందని జిల్లా బాధ్యులు బి.రమేష్‌బాబు, వలవల రాజా పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కె.కల్యాణ్‌బాబు, మట్టా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగు సులభం...

రైతుకు ఆదాయం

- వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రోత్సాహం
- రైతన్నలకు అండగా జగనన్న ప్రభుత్వం
- మారుతున్న కాలానికి అనుగుణంగా తోడ్పాటు



గంగలకుర్రులో పవర్ టిల్లర్లను రైతులకు అందిస్తున్న అధికారులు (ఫైల్)

అంబాజీపేట: దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న రైతును వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ఆదుకుంటోంది. రైతే రాజు అన్న నానుడిని నిజం చేస్తూ, వ్యవసాయాన్ని పండగ చేసేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. అన్నదాతలకు అన్ని రకాలుగా ఆదుకునేందుకు జగనన్న ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టింది. ప్రధానంగా రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు సాయం, పంటలకు బీమా సౌకర్యంతో పాటు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, శాస్త్రవేత్తల సలహాలతో పాటు, ఎన్నో రకాలుగా రూ.కోట్ల నిధులు రైతుల కోసం ప్రభుత్వం వెచ్చిస్తోంది. రాబోయే రోజుల్లో డ్రోన్‌లు రైతులు నేరుగా పొందే అవకాశం ఉంది. డ్రోన్ల వినియోగంపై అధికారులు శిక్షణ ఇస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతుకు తోడ్పాటు నందిస్తూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రభుత్వం తీసుకొస్తోంది. రైతులను సంఘటితం చేసి తమకు అవసరమైన యంత్ర పరికరాలు వారే ఎంచుకొనే విధంగా ప్రభుత్వం చైతన్యపరుస్తోంది. ఎంపిక చేసుకున్న పరికరాలను సబ్సిడీపై అందిస్తోంది. గత ప్రభుత్వంలో ఏదో ఒక పరికరాన్ని తెచ్చి దానిని సబ్సిడీపై తీసుకోవల్సిందిగా రైతులను ఆదేశించేవారు. వాటిలో రైతులకు ఉపయోగపడనివే అత్యధికంగా ఉండేవి.

కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా సేవలు

జగనన్న ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేసింది. సాగు చేసే రైతుల అవసరాలను గుర్తించి వాటినే రైతులకు అందజేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీని ద్వారా అన్ని రకాల పనిముట్లతో పాటు, కలుపు తీసే యంత్రాలు, పురుగు మందులు పిచికారీ చేసే డ్రోన్‌లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. అంబాజీపేటలో 16 గ్రామాలకు 19 ఆర్బీకేలకు ప్రభుత్వం ద్వారా రూ.కోట్ల విలువైన పనిముట్లను అందజేశారు. ట్రాక్టర్లు, పవర్‌టిల్లర్లు, రోటావేటర్లు, వరి కోత యంత్రాలు, గడ్డి చుట్టే యంత్రాలు, తైవాన్ స్ప్రేయర్లను రైతులకు అందించారు. ఆ యంత్రాల సాయంతో రైతులు తక్కువ ఖర్చుతో సాగు పనులు చేస్తున్నారు.

యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలి



ఆధునిక వ్యవసాయంలో భాగంగా శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించడంతో పాటు, కస్టమ్ హైరింగ్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కూలీల కొరతను నివారించేందుకు యంత్రాల వినియోగం అవసరం. రైతులకు అవసరమైన యంత్ర పరికరాలు ఇప్పటికే ఆయా గ్రూపులకు అందజేశాం. మరింత మంది వీటిని పొందేందుకు వీలుగా ఐదుగురు చొప్పున సభ్యులు గ్రూపులుగా ఏర్పడాలి. దరఖాస్తు చేసుకున్నవారికి యంత్రాలు సబ్సిడీపై అందిస్తాం.

– సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏవో, అంబాజీపేట

యంత్రాలతో సాగు లాభదాయకం



రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న యంత్రాలతో సాగు వల్ల తక్కువ ఖర్చుతో లాభాలు పొందుతున్నాం. రైతులను సంఘటితం చేసి అవసరమైన యంత్రాలను 40 శాతం సబ్సిడీ ద్వారా అందిస్తున్నారు. 50 శాతం బ్యాంకు నుంచి రుణం ఇవ్వగా 10 శాతం రైతులు చెల్లించుకుంటున్నాం. గ్రామాల్లో ఆర్బీకేలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మెరుగైన సమాచారంతో పాటు రాయితీలతో కూడిన పథకాలు అందుతున్నాయి.

– దొమ్మేటి రాధాసూర్యనారాయణ, రైతు, ఇరుసుమండ

రైతులు దాళ్వాకు సిద్ధం కావాలి

మలికిపురం: దాళ్వా సాగుకు రైతులు సిద్ధం కావాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ అధికారులు పాల్గొన్నారు. శివకుమార్ మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో ముందుకు సాగి రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కాలువలు, డ్రైన్లలో గుర్రపుడెక్క తొలగింపుతో పాటు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని శివకుమార్ సూచించారు. సఖినేటిపల్లి వ్యవసాల సలహా మండలి చైర్మన్ ఇంజేటి శామ్యూల్ రాజు, చింతా వరప్రసాద్, ఏడిద శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలి

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల, ఆలమూరు వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు అన్నారు. పీఎంఎంఎస్ఏ పథకంలో భాగంగా శుక్రవారం సుమారు 118 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సమావేశంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది వివరించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా తొమ్మిదిన బాలింతలు, గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెచ్ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పలు స్కూళ్లకు నూతన హెచ్ఎంలు

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా మోకా ప్రకాష్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన బీర హనుమంతరావు ముమ్మిడివరం బదిలీపై వెళ్లారు. తొండవరంలో పీవీ కేశవాచార్యులు, పుల్లేటికుర్రులో ఎస్.ఏడుకొండలు, గంగలకుర్రు అగ్రహారం కె.శ్రీనివాస్, కె.పెదపూడి ఎస్.దుర్గాదేవి, ఇసుకపూడి ఏఎల్ వరప్రసాద్ ప్రధానోపాధ్యాయుడిగా నియమితులయ్యారని ఎంఈఓ ఎస్‌జేవీ కనకదుర్గ తెలిపారు.

వ్యక్తిపై కేసు

అంబాజీపేట: పాత గొడవల నేపథ్యంలో భార్యాభర్తలను నానా దుర్భాషలాడి, మానసికంగా వేధిస్తున్నాడని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వై.సూర్యనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాచవరం శివారు పండువారిపేటకు చెందిన చిత్రపు దుర్గాదేవి తన ఇంటి నిర్మాణం కోసం వస్తువులు కొనుగోలు చేసుకుని లారీపై తీసుకువస్తుండగా పేటలోకి రానివ్వకుండా నాగవరపు అన్నవరం అడ్డుకుంటున్నాడన్నారు. లారీని లోపలకు రాకుండా ఎందుకు అడ్డుకున్నావని అన్నవరంను ప్రశ్నిస్తే దుర్గాదేవిని, ఆమె భర్తను నానా దుర్భాషలాడి అవమాన పరిచాడన్నారు. దుర్గాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వలంటీర్ అదృశ్యంపై కేసు

అయినవిల్లి: వలంటీర్ బండారు శ్రీనివాసరావు కనిపించడం లేదని ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని మడుపల్లిలో బండారు శ్రీనివాసరావు వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం నుంచి శ్రీనివాసరావు కనిపించడం లేదని శ్రీనివాసరావు బావ మేడిశెట్టి గోవిందరావు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

15 నాటికి నారుమడులు పూర్తి చేయాలి

అంబాజీపేట: వరి నారుమడులు ఈ నెల 15 నాటికి పూర్తి చేసుకునేలా రైతులు సన్నద్ధం కావాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, తహసీల్దార్ టి.మంగతాయారు అన్నారు. అంబాజీపేట ఆర్బీకేలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఏఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పంట కాలువలకు సాగు నీటిని ఈ నెల ఒకటో తేదీన విడుదల చేసిన నేపథ్యంలో వరి నాట్లు వేయాలన్నారు. పంట కాలువలో పేరుకుపోయిన చెత్తను, పూడికతీత పనులు చేసేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కొల్లు వెంకట్రావు, దేవరపల్లి చినబాలయోగి, పితాని సత్యనారాయణ, వీపీఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఉద్యోగులు

రావులపాలెం: రాష్ట్రంలోని ఒప్పంద (అవుట్‌సోర్సింగ్) ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగులుగా క్రమబద్ధీకరణ చేసిన సందర్భంగా కొత్తపేట యూనిట్‌లో ఉన్న ఒప్పంద వైద్య ఆరోగ్య, ఇతర శాఖల ఉద్యోగులు సుమారు 200 మంది సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డిని వారు ఆయన స్వగృహంలో కలిశారు. ఏపీఎన్‌జీఓ కొత్తపేట యూనిట్ అధ్యక్షుడు మోటూరి రామారావు, కార్యదర్శి నల్లా వెంకటరామారావు, కోశాధికారి అధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం జగన్‌కి వారు కృతజ్ఞతా పూర్వక అభివాదాలు తెలియజేస్తూ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితో కలసి కొత్తపేట యూనిట్ ఒప్పంద ఉద్యోగులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. థాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ తమ డిమాండ్‌ను సజీవంగా ఉంచి, వివిధ వేదికలపై ప్రస్తావించి డిమాండ్ సాధనలో కీలక భూమిక పోషించిన ఏపీఎన్‌జీఓ రాష్ట్ర, జిల్లా, కొత్తపేట యూనిట్ కార్యవర్గానికి, సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కొత్తపేట యూనిట్ ఏపీఎన్జీఓ అధ్యక్షుడు మోటూరి రామారావు, కార్యదర్శి నల్లా వెంకట రామారావు, ట్రెజరర్ సామ్యూల్‌రాజు, సహా అధ్యక్షుడు ఏపుగంటి సురేష్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులు రుద్రరాజు, శివరామిరెడ్డి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: ఉద్యోగ సంఘాల డిమాండ్లను పరిష్కరించిన సీఎం జగన్‌కి రాజోలు తాలూకా ఎన్జీఓ సంఘం శుక్రవారం కృతజ్ఞతలు తెలిపింది. రాజోలు ఉప ఖజానా కార్యాలయం వద్ద సంఘ అధ్యక్షుడు డీఎన్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. 2014 ఏడాది నాటికి ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయడంతోపాటు 11వ పీఆర్సీ బకాయిలు దశలవారీగా మంజూరు చేసేందుకు సీఎం హామీ ఇచ్చారన్నారు. సీపీఎస్ పింఛన్ విధానం రద్దు చేసి కొత్తగా జీపీఎస్ విధానం తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించడంతో పాటు, కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో హెచ్ఆర్ఏ 16 శాతం చేయడం శుభపరిణామన్నారు. రాజోలు తాలూకా సంఘ అధ్యక్షుడు డీఎన్ సుబ్రహ్మణ్యం, అసోసియేట్ అధ్యక్షుడు కప్పల శ్రీనివాసరావు, బి.సంతోషం, కట్టా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా సంక్షేమ పథకాలు



లూటుకుర్రులో గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం లూటుకుర్రులో జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పలు వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పాదయాత్రలో ప్రజల కిచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో సీఎం జగన్ ఎక్కడా మాట తప్పలేదని ఎమ్మెల్యే చిట్టిబాబు పేర్కొన్నారు. మాట తప్పలేదు. మడమ తిప్పలేదు. అందుకే ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్తున్నామని చిట్టిబాబు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. గడప గడపకు కార్యక్రమంలో ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. జగన్‌కు ఆశీస్సులు అందించాలని ప్రజల్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, గ్రామశాఖ అధ్యక్షుడు అడబాల చక్రపాణి, తులా గోపాలకృష్ణ, చింతా రామకృష్ణ, అప్పన శ్రీరామారావు, కుసుమ శ్రీనివాస్, బర్రే చిట్టిబాబు, కుసుమ పెరుమాళ్లకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు త్రైమాసికం పన్నులు చెల్లించాలి



రావులపాలెం హైవేపై వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

రావులపాలెం: లారీ, ట్రాక్టర్, గూడ్స్ వాహనాల యజమానులు త్రైమాసికం పన్నులు సకాలంలో చెల్లించాలని రావులపాలెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) వి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక నేషనల్ హైవే పై ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్ పన్నులు సక్రమంగా చెల్లించకపోవడంతో తనిఖీల్లో పట్టుబడితే భారీ పెనాల్టీలు కట్టాల్సి వస్తుందన్నారు. వాహనదారులపై పడే ఈ అదనపు భారాన్ని నివారించుకోవడానికి త్రైమాసిక పన్నులు సమయానికి చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రావులపాలెం యూనిట్ కార్యాలయం పరిధిలో పనులు చెల్లించకుండా ఉన్న వాహనాలు ట్రైలర్లు 384, గూడ్స్, ఇతర వాహనాలు 253 ఉన్నాయన్నారు. అలాగే 1988 మోటార్ వాహనాల చట్టం లోని రోడ్డు భద్రతకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఈ ఆర్థిక సంవత్సరంలో 760 కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో సుమారు రూ.25 లక్షల అపరాధ రుసుము వసూలు చేశామన్నారు. లైసెన్సులు లేకుండా, ఓవర్ లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, టార్పాలిన్ కప్పకుండా తిరుగుతూ ఈ విధంగా నిబంధనలు పాటించని వారు ఈ కేసుల్లో ఉన్నారని ఆయన తెలిపారు. వాహన యజమానులు, డ్రైవర్లు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని వాహన చట్టాలను పాటిస్తూ రవాణా అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యం ఇవ్వాలి



పెదపళ్లలో డ్రై డే సందర్భంగా నిల్వ నీరు ఉండటం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించాలని కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలానాయుడు ఆధ్వర్యంలో వైద్యారోగ్య, ఆశ సిబ్బంది డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని వారంతా ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు.

ఈ వేసవి హాట్ గురూ..



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన అంబాజీపేట సెంటర్

అంబాజీపేట: రోహిణీ కార్తె ముగిసి మృగశిర కార్తె ప్రవేశించినప్పటికీ తొలకరించలేదు సరికదా రోజు రోజుకూ ఎండ తీవ్రత పెరుగుతూ మంటలు పుట్టిస్తోంది. దీంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. గత వారం రోజులుగా ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత ప్రారంభం కావడంతో ప్రజలు బయటకు రావడానికి సాహసించడం లేదు. రాత్రి నుంచి తెల్లవార్లు వాతావరణం వేడిగానే ఉంటోంది. శుక్రవారం ఉష్ణోగ్రత 45 డిగ్రీలు ఉండటంతో ఇళ్ల నుంచి బయటకు వస్తుంటే నిప్పుల కుంపటిని తలపించి వేడిగాలులు వీస్తుండటంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వస్తున్న ప్రజలు ఎండ నుంచి రక్షణ పొందేందుకు ముఖానికి మాస్కులు వేసుకుంటున్నారు. ఎండలకు తోడు వడ గాలులు వీస్తుండటంతో దప్పికకు గురవుతున్నారు. ప్రధాన కూడళ్లలో ఎక్కడా చలివేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం దారుణమని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

పంట బోదెలు బాగు చేయించాలి

అయినవిల్లి: తొలకరి పంట సాగు చేసేందుకు అనువుగా పంట బోదెలను ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో బాగు చేయించాలని జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాకిలేటి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సలహా మండలి సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాకిలేటి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎంఏ షంషీ మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఉత్తమ సేవలందించాలన్నారు. ఆర్‌బీకేల పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఏవో వై.శోభను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల పనితీరుపై సమీక్ష

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల్లోని వివిధ ఉద్యోగుల పనితీరుపై శుక్రవారం ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య సమీక్షించారు. గ్రామాల్లో జరిగే ప్రభుత్వ అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. అలాగే గ్రామాల్లోని పారిశుధ్య పనులు పనితీరు, వేసవిలో తాగునీటి వసతి, వైద్యసేవలు వంటి వాటిపై సమీక్షించారు.

వివిధ పథకాలపై ఎంపీడీఓ సమీక్ష

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎంపీడీఓ నాతి బుజ్జి వెటర్నరీ, పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక, సుస్మిత, సునీత, పంచాయతీ కార్యదర్శులతో వివిధ సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ టీవీ సురేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారి వై.శ్రీవల్లి ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 34 మంది గర్భిణులకు వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. ప్రస్తుత వేసవిలో గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. పాలకొల్లుకు చెందిన బోళ్ల మురళీమోహనరావు, సత్యవతి దంపతుల ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఎంపీహెచ్ఈఓ ఎ.నాగరాజు, పీహెచ్ఎన్ కె.మేరీరత్నం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హజ్ యాత్రకు ముస్లింల పయనం

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన ముస్లింల బృందం రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీతో శుక్రవారం హజ్ యాత్రకు బయలు దేరింది. ఈ బృందానికి స్థానిక ముస్లిం పెద్దలు నగరం పెద పంజీషా వద్ద వీడ్కోలు పలికారు. యాత్రకు వెళ్లే ముందు బృందం సభ్యులు నగరం పెద పంజీషాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒక్కో యాత్రికుడికి రాష్ట్ర ప్రభుత్వం రూ.80 వేలు సబ్సిడీగా అందించిందని జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు సజ్జాద్ హుస్సేన్ తెలిపారు. నగరం నుంచి బయలుదేరిన బృందం సభ్యులు విజయవాడలో బస చేసి అక్కడి నుంచి నేరుగా శనివారం హజ్ యాత్రకు వెళ్తుందన్నారు. హజ్‌యాత్రలో భాగంగా ముస్లిల పవిత్ర పుణ్యక్షేత్రాలను ఈ బృందం సభ్యులు దర్శించుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరం ఉప సర్పంచ్ అన్వర్‌తాహిర్ హుస్సేన్, పార్టీ నగరం గ్రామశాఖ అధ్యక్షుడు కడలి శ్రీను, వానరాశి బాబి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ చెరువు పరిశీలన

ఆత్రేయపురం: మండలంలోని తాడిపూడిలో ఉన్న పంచాయతీ చెరువును ఎంపీడీఓ నాతిబుజ్జి పరిశీలించారు. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి గ్రామ ప్రజలు పంచాయతీ చెరువులో మత్స్య సంపద కోసం లీజు పొందిన లీజు దారులు చెరువు నిండా పెరిగిన గుర్రపుడెక్కను తొలగించడానికి మందు స్ప్రే చేయడం వల్ల ఎండిన గుర్రపుడెక్క వల్ల దుర్వాసన వస్తుందని ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు ఎంపీడీఓ నాతి బుజ్జి, సర్పంచ్ ముదునూరి వెంకట సుబ్బలక్ష్మి, చెరువు లీజుదారుడితో కలసి పరిశీలించారు. సోమవారం నుంచి గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపడతామని లీజు దారుడు తెలిపారు. కార్యక్రమంలో ముదునూరి గణపతిరాజు, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు నాటి స్వామి, ఉమా మహేశ్వర ఫిషరింగ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.